TELTEL/2022/83842

PRABHATA GAMANAM


# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

బుధవారం 01, ఏప్రిల్ 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :198 | పేజీలు :4 | వెల. 3/-

## పంచాయతీలకు రూ. 247 కోట్లు

- 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్ విడుద ల
- సదుపాయాల కల్పనకు లైన్ క్లియర్



04




04

# పట్టణ అభివృద్ధికి కృషి చేయాలి

- పట్టణాభివృద్ధిలో సమన్వయమే కీలకం
- 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమర్థవంతంగా అమలు చేయాలి
- పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పనే ప్రథమ ప్రాధాన్యత
- మున్సిపల్ చట్టం-2019పై అవగాహన పెంచుకోవాలి
- రూ. 92.68 కోట్లతో మహబూబాబాద్ మున్సిపాలిటీ బడ్జెట్
- ప్రజా ప్రతినిధులు వార్డుల్లో తిరగాల్సిందే: కలెక్టర్ స్నేహ శబరీష్
- పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దంటూ హెచ్చరికలు

"మహబూబాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ. 92.68 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన బడ్జెట్‌కు ఈ సందర్భంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది."

—ప్రభాత గమనం, మహబూబాబాద్

# ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం
- భర్త ఇంటికి నిప్పు పెట్టిన బంధువులు

2

బతుకుదెరువు కోసం వెళ్ళిన ఆ కుటుంబంలో పెను విషాదం నిండింది. నమ్ముకున్న భర్తే కాలయముడు కావడంతో, మనస్తాపం చెందిన ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను చంపి, తాను కూడా బలవన్మరణానికి పాల్పడిన హృదయవిదారక ఘటన హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో చోటుచేసుకుంది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని బోడ మాణిక్య తండాలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

# చికెన్ షాపులు బంద్

- కమీషన్ మార్జిన్ పెంచే వరకు పోరాటం
- నేడు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా
- పెరిగిన అద్దెలు, కరెంటు బిల్లులతో కుదేలవుతున్న వ్యాపారులు
- బంద్ పాటించని షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామన్న అసోసియేషన్

2

తెలంగాణవ్యాప్తంగా చికెన్ వ్యాపారులు సమ్మె బాట పట్టారు. పౌల్ట్రీ కంపెనీల ఏకపక్ష విధానాలు, కమీషన్ మార్జిన్ల తగ్గింపుతో నష్టపోతున్నామంటూ తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో హైదరాబాద్ సహా అన్ని ప్రధాన నగరాల్లో నేటి నుంచి చికెన్ అమ్మకాలు నిలిచిపోనున్నాయి."

# మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా.. లొంగిపోండి!

- మావోయిస్టు అగ్రనేతకు మరోసారి డీజీపీ పిలుపు
- అడవిబాట వీడి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి

హింసకు భవిష్యత్తు లేదు.. శాంతికి మాత్రమే ఉంది అంటూ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం మావోయిస్టు అగ్రనేత గణపతితో పాటు మిగిలిన మావోయిస్టులకూ విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉంటూ ఉద్యమాన్ని నడిపిస్తున్న నేతలు, తక్షణమే లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, వార్తా శేఖర్ అలియాస్ మంగ్తూ, జోడే రత్నబాయి అలియాస్ సుజాత, నక్కా సుశీల అలియాస్ రేల, రంగబోయిన భాగ్య అలియాస్ రూపి ఇప్పటికీ అడవిలోనే ఉన్నారని, వీరంతా తమ కుటుంబాల వద్దకు తిరిగి రావాలని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి రక్షణ, భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

—ప్రభాత గమనం, హైదరాబాద్

2





ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా.. లొంగిపోండి!

- మావోయిస్టు అగ్రనేతకు మరోసారి డీజీపీ పిలుపు
- అడవిబాట వీడి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి






ప్రభాత గమనం, హైదరాబాద్: హింసకు భవిష్యత్తు లేదు.. శాంతికి మాత్రమే ఉంది అంటూ డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం మావోయిస్టు అగ్రనేత గణపతితో పాటు మిగిలిన మావోయిస్టులకూ విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉంటూ ఉద్యమాన్ని నడిపిస్తున్న నేతలు, తక్షణమే లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, వార్తా శేఖర్ అలియాస్ మంగ్తూ, జోడే రత్నబాయి అలియాస్ సుజాత, నక్కా సుశీల అలియాస్ రేల, రంగబోయిన భాగ్య అలియాస్ రూపి ఇప్పటికీ అడవిలోనే ఉన్నారని, వీరంతా తమ కుటుంబాల వద్దకు తిరిగి రావాలని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి రక్షణ, భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వ పునరావాస విధానంపై నమ్మకంతో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ వెల్లడించారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక, సామాజిక సహకారంతో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉంటూ వయసు పైబడటం వల్ల లేదా ఇతర కారణాల వల్ల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేతలకు మెరుగైన, అధునాతన వైద్య చికిత్సలు అందిస్తామని ప్రత్యేకంగా హామీ ఇచ్చారు. "మీ క్షేమం మాకు ముఖ్యం. ప్రజాస్వామ్యం, అభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన 'మావోయిస్టు రహిత సమాజం' గడువు సమీపిస్తున్న వేళ, తెలంగాణ పోలీస్ బాస్ నుంచి వచ్చిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ సానుకూల ధోరణికి స్పందించి అగ్రనేతలు శాంతిబాట పడతారో లేదో వేచి చూడాలి.

# చికెన్ షాపులు బంద్

- పౌల్ట్రీ కంపెనీలపై వ్యాపారుల నిరసన

ప్రభాత గమనం, హైదరాబాద్: తెలంగాణవ్యాప్తంగా బుధవారం నుంచి చికెన్ షాపులు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా 'తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్' ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ మార్జిన్‌ను భారీగా తగ్గించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్జిన్‌ను తగ్గించడంపై వారు మండిపడుతున్నారు. పెరిగిన షాపు అద్దెలు, కరెంటు బిల్లులు, పనివారి జీతాల దృష్ట్యా ఈ మార్జిన్‌తో వ్యాపారం చేయడం సాధ్యం కాదని వారు స్పష్టం చేస్తున్నారు. కేవలం బంద్ మాత్రమే కాకుండా, తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టాలని అసోసియేషన్ నిర్ణయించింది. మార్జిన్ పెంపుపై కంపెనీలు దిగివచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని నాచారం అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. యజమానులందరూ ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ కోరింది. ఒకవేళ ఎవరైనా అసోసియేషన్ నిర్ణయాన్ని ధిక్కరించి షాపులు తెరిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ చికెన్ షాప్స్ అసోసియేషన్ గట్టిగా హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రధాన నగరాల్లోనూ ఈ బంద్ ప్రభావం ఉండనుంది. పౌల్ట్రీ యజమానులు, కంపెనీల మధ్య చర్చలు విఫలమైతే ఈ సమ్మె మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.



# పంచాయతీలకు రూ. 247 కోట్లు

- 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్ విడుద ల
- సదుపాయాల కల్పనకు లైన్ క్లియర్

ప్రభాత గమనం, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేస్తూ మంగళవారం తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు రూ.1,500 కోట్లకు పైగా గ్రాంట్లను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగానే తెలంగాణ పల్లెలకు రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులు 202 5-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత 'అన్‌టైడ్ గ్రాంట్స్' అని పేర్కొంది. నిధు లను పాలకవర్గాలు గ్రామసభలు నిర్ణయించిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం మాత్రమే వినియోగించాలి. సిబ్బంది జీతాల చెల్లింపులకు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వాడకూడదు. నిధులు నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి చేరడం వల్ల క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులకు వేగం పుంజుకోనుంది. గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, స్థా నిక స్వపరిపాలనలో పారదర్శకతను పెంచడం కోసమే నిధులు కేటాయించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

# ఢిల్లీలో వీఆర్ఏ వారసుల అర్ధనగ్న ప్రదర్శన

- 3,797 మందికి నియామక ఉత్తర్వులివ్వాలని డిమాండ్
- మద్దతు ప్రకటించిన బీసీ సంఘం



ప్రభాత గమనం, హైదరాబాద్ : తమకు తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణకు చెందిన వీఆర్ఏ (గ్రామ రెవెన్యూ సహాయకులు) వారసులు వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. తమ గోడు ఏఐసీసీ పెద్దలకు తెలిసేలా అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి నిరసన తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవోలు 81, 85 ద్వారా సుమారు 16,500 మంది వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేసి పోస్టింగ్‌లు ఇచ్చిందని గుర్తుచేశారు. 61 ఏండ్లు పైబడిన 3,797 మంది వీఆర్ఏలను గుర్తించి, వారి వారసులకు విద్యార్హతను బట్టి ఉద్యోగాలు ఇస్తామని జీవోలో పొందుపరిచారని తెలిపారు. పదో తరగతి పాసైన వారికి అటెండర్, ఇంటర్ చదివిన వారికి రికార్డు అసిస్టెంట్, డిగ్రీ పూర్తిచేసిన వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని జీవోలో స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ తమకు నియామక ఉత్తర్వులు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని, దీంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్నాకు పలువురు బీసీ సంఘం నేతలు మద్దతు ప్రకటించారు.

# ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం
- భర్త ఇంటికి నిప్పు పెట్టిన బంధువులు

ప్రభాత గమనం, నర్సంపేట : బతుకుదెరువు కోసం వెళ్ళిన ఆ కుటుంబంలో పెను విషాదం నిండింది. నమ్ముకున్న భర్తే కాలయముడు కావడంతో, మనస్తాపం చెందిన ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను చంపి, తాను కూడా బలవన్మరణానికి పాల్పడిన హృదయవిదారక ఘటన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో చోటుచేసుకుంది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని బోడ మాణిక్య తండాలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

## - ఘటన వివరాల్లోకి వెళ్తే..



చెన్నారావుపేట మండలం బోడ మాణిక్య తండాకు చెందిన బోడ స్రవంతి, ప్రవీణ్ దంపతులు కొన్నాళ్ల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. కూకట్‌పల్లి ప్రాంతంలో నివసిస్తున్న వీరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. భర్త ప్రవీణ్ పెడుతున్న వేధింపులు భరించలేక, తీవ్ర మనస్తాపానికి గురైన స్రవంతి.. తన ఇద్దరు బిడ్డలను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకుంది.

## - స్వగ్రామంలో నిరసన జ్వాలలు

స్రవంతి మరణవార్త ఆమె స్వగ్రామమైన బోడ మాణిక్య తండాకు చేరడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్రవంతి ఆత్మహత్యకు భర్త వేధింపులే కారణమని ఆగ్రహించిన మృతురాలి బంధువులు, గ్రామస్థులు ప్రవీణ్ ఇంటిపై దాడికి దిగారు. ఆగ్రహావేశాలతో నిందితుడు ప్రవీణ్ ఇంటిని, లోపల ఉన్న ఫర్నిచర్‌ను తగలబెట్టారు. దీంతో తండాలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజాపాలన ప్రతిబింబించేలా
# గ్రామసభలు నిర్వహణ..

- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క...
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలి...
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు
- గ్రామసభ నిర్వహణపై వీసీ
- కలెక్టర్లతో సమీక్షించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్ ప్రభాత గమనం 31(ప్రభాత గమనం): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ, వార్డుసభల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశానికి మహబూబాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్థానిక సంస్థల, రెవెన్యు అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్ సంబందిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే తరహాలో ఉండాలని, గ్రామ సభలకు వార్డు మెంబర్ నుంచి ఎంపీ, మంత్రుల వరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు.గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల చేత గ్రామ సభలలో మాట్లాడించాలని అన్నారు.జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతో పాటు, పాలు, రాగి జావా, ఇంటర్ విద్యార్థుల కు మధ్యాహ్న భోజనం గురించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. సాంస్కృతిక శాఖ కళాకారులను ఉపయోగిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు.గ్రామాలకు ప్రభుత్వం భారీ ఎత్తున విడుదల చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు.అనంతరం సీఎస్ కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, అదే స్పూర్తితో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రతి జిల్లాలో గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి అనే అంశంపై రిపోర్టు అందించాలని కలెక్టర్ లను ఆదేశించారు. గ్రామ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని, స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలో ఉండాలని అన్నారు.గ్రామ సభలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియ జేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు.విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామ సభలను నిర్వహించి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ..మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్వహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించి, నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఏ మధుసూదన రాజు, జెడ్.పి సీ.ఈ.ఓ పురుషోత్తం, సి.పి.ఓ శ్రీనివాస రావు, జిల్లా వైద్యాధికారి డా.బి. రవి రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, వ్యవసాయ అధికారి సరిత, పంచాయతీ అధికారి హరిప్రసాద్, విద్యాదికారి రాజేశ్వర్, మహబూబాబాద్ మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేత

కేసముద్రం మార్చి 31(ప్రభాత గమనం): ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ సింగారపు శారద భర్త సురేందర్ ఇటీవలె అనారోగ్యంతో మరణించారు.ఈ నేపథ్యంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు గొర్రె వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం నాడు కేసముద్రం,ఇనుగుర్తి మండల రేషన్ డీలర్లు ఆ కుటుంబాన్ని పరామర్శించారు.మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మనో ధైర్యాన్ని నింపారు.అనంతరం రేషన్ డీలర్ల సంఘం తరుపున రూ. 20,500 రుపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు మహమ్మద్ అలీ, సట్ల రజిత శ్రీనివాస్, కోశాధికారి వెంకట్రావు,గంధసిరి వెంకన్న, మంద





## ముత్తి తండాలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

### - గిరిజన నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత

గార్ల మండలం ముత్తి తండాలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గిరిజన నాయకులు మంగళవారం నాడు ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలో గత కొంతకాలంగా గిరిజనులు విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటారని వివరించారు. ముత్తి తండాలో చాలా రోజుల క్రితమే సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా, దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. గ్రామ పార్కు నుండి ట్రాన్స్‌ఫార్మర్ వరకు ఉన్న త్రీఫేస్ వ్యవసాయ విద్యుత్ వైర్లు భూమికి తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయన్నారు. వీటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న వైర్ల కోసం మిడిల్ పోల్స్ వేయాలని డిమాండ్ చేశారు. గతంలోనే ఈ సమస్యలపై సిజిఆర్ఎఫ్ కు ఫిర్యాదు చేసినప్పటికీ, నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్, నాయకులు రూన్వాల్ వీరన్న, రాజేష్, బి. కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆన్ లైన్ ద్వారా ఇసుక కేటాయింపులు

మహబూబాబాద్ మార్చి 31(ప్రభాత గమనం): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఇసుక సరఫరా పంపిణీలో కొత్త మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందని జిల్లాలో ఇకపై మానువల్ పద్ధతిలో కూపన్లు పంపిణీ చేయడం జరగదని, కొత్త మార్గదర్శకాలు నిబంధనల ప్రకారం ఇక పూర్తిస్థాయిలో ఆన్లైన్ విధానం ద్వారా మాత్రమే ఇసుక సరఫరా కూపన్లు ఇవ్వడం జరుగుతుందని, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ప్రజలు ఇసుక అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ కొత్త మార్గదర్శకలను పాటించాలని వారు కోరారు.

# పట్టణ అభివృద్ధికి కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




మహబూబాబాద్ మార్చి 31(ప్రభాత గమనం): పట్టణాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని మునిసిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన మహబూబాబాద్ మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ మునిసిపల్ చట్టం-2019 పై ప్రతి ఒక్క వార్డు కౌన్సిలర్లకు, అధికారులకు అవగాహన ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని సూచించారు.పట్టణ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ,త్రాగు నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మొదటిసారిగా పాల్గొన్న కౌన్సిల్ సభ్యులను అభినందించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.పట్టణం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయడంతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా వార్డుల్లో పర్యటిస్తూ చెత్త తొలగింపు, డ్రైనేజీలను శుభ్రపరచడం, రోడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మునిసిపాలిటీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.92 కోట్ల 68 లక్షల 69 వేల ఆదాయం, రూ.92 కోట్ల 66 లక్షల 70 వేల వ్యయంతో బడ్జెట్ ను ఆమోదించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, చైర్పర్సన్ జ్యోతి రమేష్, వైస్ చైర్పర్సన్ సూర్ణపు సోమయ్య, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో ఆర్థిక స్వావలంబన

- **జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
- **మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో రాష్ట్రంలో 10 వేల కోట్లు మహిళలు చార్జీలు ఆదా చేసిన సందర్భంగా వేడుకలు**



మహబూబాబాద్ మార్చి 31(ప్రభాత గమనం): ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగ పడుతుందని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి రెండేండ్లకుపైగా పూర్తి అయి 290 కోట్ల ప్రయాణాలు మహిళలు చేయగా, రూ.10 వేల కోట్లు ఆదా చేసిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఆర్టీసీ అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించగా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఆర్టీసీ బస్సుల సేవలు నిత్యం వినియోగించుకుంటున్న పలువురు మహిళలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలు, సంక్షేమ ఫలాలు వారి పేరిట, వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు డిసెంబర్ 9వ తేదీ 2023 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు.మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే మహిళలు డబ్బులు ఆదా చేసుకొని, వాటిని పిల్లల చదువు, స్వయం ఉపాధి, పొదుపు వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఈ పథకం దోహదం చేస్తుందని, బస్సుల్లో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని పేర్కొన్నారు.పలు ప్రభుత్వ పథకాలు మహిళల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని తెలిపారు. చీరలు మన సంస్కృతికి నిదర్శనమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతు పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా అమలు చేస్తుందని వెల్లడించారు. బ్యాంక్ లింకేజ్ రుణాలు, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, డీఆర్డీఓ మధుసూదన రాజు,మెప్మా అధికారి విజయ, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీటిని వదిలి రైతాంగాన్ని ఆదుకోవాలి

**- అధికారులకు రైతుల వేడుకోలు**



గార్ల మార్చి 31(ప్రభాత గమనం): వేసవి కాలం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నప్పటికీ, గార్ల మండలంలోని పాకాల ఏరు అప్పుడే అడుగంటిపోవడం స్థానిక రైతాంగాన్ని తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. ఏరు ఎండిపోవడంతో సాగునీరు అందక పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. పాకాల ఏరు పరివాహక ప్రాంతంలోని సుమారు 300 ఎకరాల్లో రైతులు వేసంగి పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలు కీలక దశకు చేరుకున్న ఈ సమయంలో ఏరు ఎండిపోవడంతో నీటి లభ్యత పూర్తిగా నిలిచిపోయింది. దీనివలన నీరు లేక పంట భూములు నెర్రెలు చాస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా దక్కదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే నీటి సదుపాయం కల్పించకపోతే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు స్పందించి, ఎస్సారెస్పీ (ఎస్సారెస్పీ) కెనాల్ ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలని రైతులు వేడుకుంటున్నారు. కెనాల్ నీరు విడుదల చేస్తేనే తమ పంటలు గట్టెక్కుతాయని, లేని పక్షంలో తాము భారీగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతామని వారు వాపోతున్నారు.ఏరు ఎండిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. అధికారులు కనికరించి ఎస్సారెస్పీ నీటిని వదిలి మా పంటలను కాపాడాలి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# చిర్ర యాకాంతం గౌడ్ కు ఘన సన్మానం

కేసముద్రం మార్చి 31(ప్రభాత గమనం): కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో విద్యావేత్త,సామాజికవేత్త,శ్రీ వివేకవర్ధిని హై స్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ ను మంగళవారం నాడు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ..కష్టపడి చదివి పేద పిల్లలకు సహాయం చేసే విధంగా విద్య సంస్థను ఏర్పరిచి 23 ఏళ్ల నుండి వందల మంది విద్యార్థులను తీర్చిదిద్ది ఆదర్శప్రాయంగా నిలిచిన యాకాంతం గౌడ్ సేవలు చాలా గొప్పవని కొనియాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పాటుపడుతున్న యాకాంతం గౌడ్ అధ్యాపక బృందం సన్మానించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ సిహెచ్. మైసయ్య, డాక్టర్ రమేష్ నాయక్ , ప్రవీణ్ కుమార్,మంజుల, సలీం ,రాజు, యాదగిరి, రవి గారు, రమాదేవి, మున్నీ, మరియు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

printed, Published and Owened by PANDULA RAVICHANDER at H.NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABAD, TELANGANA, 506001. Editor. P. Ravichander★Email:www.prabhatagamanam.com ★ RNI NO TELTEL/2022/83842. cell: 7780470374